بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ



# హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం నిజమైన దాసుడు హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం కరుణావాత్సల్యాలు, దాతృత్వం, ఉదారత ఆధారంగా విశ్వాసభరిత ప్రస్తావన

హజ్రత్ అమీరుల్ మొమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 03.07.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ. بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయం పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు. నేను హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కరుణావాత్సల్యాలు మరియు దాతృత్వానికి సంబంధించిన కొన్ని సంఘటనలను సమర్పిస్తాను.

హజ్రత్ షేక్ యాఖూబ్ అలీ ఇర్ఫానీ రజియల్లాహు అన్హు గారు ఇలా వ్రాస్తున్నారు. హుజూర్ అలైహిస్సలాం గారి దాతృత్వం ఒక అంతులేని నది లాంటిది, ఆయన హస్తం ముత్యాలను కురిపించే మేఘం లాంటిది. అది కురుస్తూ, అందరినీ తృప్తిపరుస్తూ సాగిపోయేది. ఈ పరంపర రంజాన్ మాసంలో మరీ ఎక్కువగా పెరిగిపోయేది.

అబ్దుల్ ఘఫ్ఫార్ కాశ్మీరీ గారు ఇలా వివరిస్తున్నారు. తన వివాహం జరిగినప్పుడు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు తనకు రెండు విలువైన ఆభరణాలను బహుకరించారు. ఈ సంఘటన హుజూర్ అలైహిస్సలాం అవతరణ కంటే ముందు నాటిది, అప్పుడు ఆయన ఇంకా ఏకాంత జీవితాన్ని గడుపుతూ ఉండేవారు.

బషీర్ భట్టి గారిలా వివరిస్తున్నారు. హజ్రత్ మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్ రజియల్లాహు అన్హు వివాహ సందర్భంలో ఒక మిరాసీ (సాంప్రదాయ సంగీత కళాకారుల కుటుంబానికి చెందిన) మహిళ డోలు తీసుకుని వచ్చి, దానిని వాయించడం ప్రారంభించింది. అప్పుడు హుజూర్ (అ) ఆమెను ఆ డోలు వాయించవద్దని చెప్పండి, ఆమెకు ఏమి కావాలో అది ఇచ్చేయండి అని చెప్పారు. ఆ విధంగా ఆమెకు నాలుగు-ఐదు రూపాయలు ఇవ్వబడ్డాయి. ఆ తర్వాత ఆమె తనకు చలిగా ఉందని చెప్పింది. దానికి హుజూర్ అలైహిస్సలాం ఆమెకు ఒక రజాయి (దుప్పటి) కూడా ఇప్పించారు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారిలా వివరిస్తున్నారు. అన్నింటికంటే ముందు ఒక విషయాన్ని మనస్సులో ఉంచుకోవలెను. అనగా హుజూర్ (అ) గారికి ఎటువంటి ప్రత్యేకమైన దుస్తుల పట్ల ఆసక్తి ఉండేది కాదు. ఆయన చివరి రోజుల్లోని కొన్ని సంవత్సరాలలో ఆయన వద్దకు కుట్టిన బట్టలు చాలా ఎక్కువగా వచ్చేవి, ముఖ్యంగా కోట్లు మొదలైనవి. ఆయన తలపాగాను మాత్రం అప్పుడప్పుడు స్వయంగా కొనుగోలు చేసి కట్టుకునేవారు. దుస్తులు ఏ విధంగా సిద్ధమై వస్తూ ఉండేవో, అదే విధంగా అవి ఇవ్వబడుతుండేవి (తబర్రుక్/ఆశీర్వాదంగా అడిగే వారికి ఇచ్చేసేవారు).

హజ్రత్ మీర్ మహ్దీ హుస్సేన్ గారిలా వివరిస్తున్నారు. ఒకసారి మౌల్వీ ముహమ్మద్ అహ్సాన్ గారు నన్ను 'చష్మ-ఎ-మసీహీ' పుస్తకపు ఒక ప్రతిని ఇవ్వవలసిందిగా కోరారు. దానికి నేను హుజూర్

అలైహిస్సలాం కార్యాలయంలో కొన్ని ప్రతులు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని ఆదేశించారని, ఎందుకంటే కొన్నిసార్లు ప్రభుత్వం వాటిని అడుగుతుందని, ప్రస్తుతం అదనపు ప్రతులు ఏవీ లేవని సమాధానం ఇచ్చాను. మీరు హజ్రత్ గారితో వ్రాసి అభ్యర్థించవచ్చు అని చెప్పాను. ఆయన వ్రాసి అడగడంతో, హుజూర్ అలైహిస్సలాం ఒక ప్రతిని దయచేశారు.

హజ్రత్ మున్షీ జఫర్ అహ్మద్ గారిలా వివరిస్తున్నారు. హుజూర్ (అ) వద్ద కస్తూరి ఉండేది. ఒకసారి నేను హుజూర్! నాకు కస్తూరి కావాలి అని మనవి చేశాను. దానికి హుజూర్ (అ) ఆ కస్తూరి డబ్బాను నా ముందుకు జరిపి, అందులో నుండి మీకు ఎంత కావాలో అంత తీసుకోండి అని చెప్పారు. నేను అందులో నుండి చాలా కొద్దిగా తీసుకోగా, హుజూర్ (అ) చిరునవ్వు నవ్వి ఇది చాలా తక్కువ అని అంటూ దాదాపు ఒకటి లేదా ఒకటిన్నర తోలాల కస్తూరిని స్వయంగా నా చేతిలో పెట్టారు.

హుజూర్ (అ) హృదయంలో తన మిత్రుల పట్ల ఎంతటి ఆవేదన, శ్రద్ధ ఉండేదో తెలిపే ఒక సంఘటన ఇలా ఉంది. హజ్రత్ హకీమ్ ఫజ్లుర్రహ్మాన్ గారిలా వివరిస్తున్నారు. నా భార్య ఒక బిడ్డకు జన్మనిచ్చింది. ఆ తర్వాత ఏడవ రోజు సూర్యాస్తమయం సమయానికి ఆమెలో ధనుర్వాతం లక్షణాలు కనిపించడం ప్రారంభించాయి. నేను మగ్రిబ్ నమాజ్ తర్వాత హుజూర్ (అ) వద్దకు పరుగెత్తాను. దానికి హుజూర్ (అ) ఇది చాలా ప్రమాదకరమైన వ్యాధికి సంకేతం, నువ్వు నీ భార్యకు ఇంగువ ఇవ్వు, ఒకటో ఒకటిన్నర గంట తర్వాత నాకు సమాచారం అందించు అని చెప్పారు. నేను ఇషా నమాజ్ తర్వాత మళ్లీ వెళ్లి, వ్యాధి మరింత ఎక్కువైందని మనవి చేశాను. హుజూర్ (అ) రకరకాల మందులను సూచిస్తూ వచ్చారు, కానీ వ్యాధి పెరుగుతూనే పోయింది. చివరకు ఒక దశలో రోగికి వాంతి అయ్యింది, ఈ వ్యాధిలో అది చివరి దశ. ఆ తర్వాత శ్వాస ఆడటం కష్టమైంది, మెడ వెనక్కి లాగేసింది, కళ్లల్లో చీకట్లు కమ్మాయి మరియు నోటి మాట పడిపోయింది. నేను వెంటనే పరుగెత్తుకుంటూ మెట్లు ఎక్కాను. హుజూర్ (అ) నా స్వరం విని తలుపు తీసి ఏమిటి, అంతా క్షేమమేనా? అని అడిగారు. నేను ఇప్పుడు పరిస్థితి చాలా ఆందోళనకరంగా ఉందని మనవి చేశాను. హుజూర్ (అ) వివరాలన్నీ విని ప్రపంచంలో ఉన్న ఆయుధాలన్నింటినీ మనం ఉపయోగించాం. ఇప్పుడు ఒకే ఒక్క ఆయుధం మిగిలి ఉంది, అదే ప్రార్థన (దుఆ). నువ్వు వెళ్ళు! ఇక ఆమెకు ఆరోగ్యం చేకూరేంత వరకు నేను ప్రార్థన నుండి తల పైకెత్తను అని సూచించారు. నేను ఇది విని వెనక్కి వచ్చి, నా భార్యతో ఇక నీకేం పర్వాలేదు, ఇప్పుడు ఆ గుత్తేదారుడే స్వయంగా బాధ్యత తీసుకున్నారు అని చెప్పాను. ఆ సమయానికి రాత్రి రెండు గంటల వుతుంది. నేను ఇంటికి వచ్చి, రోగిని అదే స్థితిలో వదిలేసి, పక్క గదిలోకి వెళ్లి పడుకున్నాను. ఉదయం ఏదో పాత్ర చప్పుడు కావడంతో నాకు మెలకువ వచ్చింది. చూస్తే నా భార్య పూర్తిగా కోలుకుని ఆరోగ్యంగా ఉంది. ఆమె నాతో మీరైతే నిద్రపోతున్నారు, కానీ రెండు గంటల తర్వాత అల్లాహ్ తఆలా తన అనుగ్రహాన్ని కురిపించాడు అని చెప్పింది.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. ఈ సంఘటనలో స్నేహితుల పట్ల ఆవేదన మరియు దాతృత్వం గురించి ఉత్తమోత్తమ ప్రమాణాలు తెలుస్తున్నాయి.

ఒకసారి ఖాదియాన్‌లో ఒక గట్టి విరోధికి అతని దగ్గరి మంధువు కొరకు కస్తూరి అవసర& ఏర్పడింది. కస్తూరి దొరకడమే కష్టం కాకుండా, అది చాలా ఖరీదైన వస్తువు కూడా. అతడు హుజూర్ అలైహిస్సలాం గారి ఇంటి ముంగిటకు వచ్చి కస్తూరి కావాలని అడిగాడు. హుజూర్ అలైహిస్సలాం వెంటనే దాదాపు అర తోల కస్తూరిని అతనికి అందజేశారు.

ప్లేగు వ్యాధి (తావూన్) ప్రబలినప్పుడు హుజూర్ (అ) దైవవాణి, జ్ఞానాధారంగా ఒక మందును

తయారు చేయడం ప్రారంభించారు. దానికి తిర్యాఖ్-ఎ-ఇలాహీ అని పేరు పెట్టారు. ఈ మందులో వేల రూపాయల విలువైన రత్నాలు, ఎన్నో ఖరీదైన ఔషధాలు వేయబడ్డాయి. ఈ మందు సిద్ధమైనప్పుడు హుజూర్ (అ) ఎంతో ఉదార హృదయంతో దానిని పంపిణీ చేశారు. బయటి ప్రాంతాల నుండి మందు కావాలని కోరిన వారికి తమ స్వంత ఖర్చులతో రిజిస్టర్డ్ పార్సిల్ ద్వారా కూడా పంపించేవారు.

హజ్రత్ ముఫ్తీ ముహమ్మద్ సాదిఖ్ గారు ఒక లేఖలో హుజూర్ (అ) గారితో ఇలా మనవి చేసుకున్నారు: గర్భధారణ కారణంగా ఇంట్లో ఇబ్బందిగా ఉంది, వంట చేయడం సాధ్యపడటం లేదు. రొట్టెలు తందూరి వద్ద చేయించుకుంటున్నాము కానీ కూర వండుకోవడం కష్టంగా ఉంది. అందువల్ల లంగర్ నుండి భోజనం ఏర్పాటు చేయవలసిందిగా కోరారు. దీనిపై హుజూర్ (అ) లంగర్ అధికారిని పిలిపించి ముఫ్తీ గారికి లంగర్ నుండి రెండు పూటలా మంచి కూరను అందజేయాలని ఆదేశించారు.

ఒకసారి పరిశోధన నిమిత్తం ఒక ప్రతినిధి బృందాన్ని 'నసీబైన్' పంపాలని నిర్ణయించారు. ప్రయాణ ఏర్పాట్ల కోసం హుజూర్ అలైహిస్సలాం ఆ బృందంలోని సభ్యులకు చెరి యాభై రూపాయలు ఇచ్చారు. ఆ తర్వాత కొన్ని కారణాల వల్ల ఆ బృందం వెళ్ళలేకపోయింది. ఆ బృందంలోని ఒక సభ్యుడు ఆ యాభై రూపాయలను తిరిగి ఇవ్వబోగా, హుజూర్ అలైహిస్సలాం మేము ఎవరికైనా ఏదైనా ఇస్తే, దానిని తిరిగి తీసుకోము అని చెప్పారు.

ఒకసారి లంగర్ (ఉచిత వంటశాల) ఖర్చుల కోసం డబ్బులు అయిపోయాయి. అప్పుడు హుజూర్ అలైహిస్సలాం సతీమణి వద్ద నుండి అవసరానికి సరిపడా ఏదైనా ఆభరణాన్ని తీసుకుని దానిని అమ్మి ఏర్పాట్లు చేసుకోండని చెప్పారు. రెండు రోజుల తర్వాత మళ్లీ డబ్బులు అయిపోయాయి. అప్పుడు హుజూర్ అలైహిస్సలాం బాహ్య వనరులను బట్టి మనం ఏర్పాటు చేశాం ఇప్పుడు మనకు ఆ అవసరం ఏమియును లేదు. వీరు ఎవరి అతిథులో అతడే స్వయంగా ఏర్పాటు చేసుకుంటాడని చెప్పారు. అనంతరం ఉదయం ఎనిమిది తొమ్మిది గంటల సమయంలో పోస్ట్‌మ్యాన్ వచ్చినప్పుడు అతని చేతిలో వంద, యాభై రూపాయల చొప్పున వేర్వేరు ప్రాంతాల నుండి వచ్చిన దాదాపు పది పదిహేను మనీ ఆర్డర్లు ఉన్నాయి. హుజూర్ అలైహిస్సలాం ఆ మనీ ఆర్డర్లను స్వీకరించి దైవ నమ్మకంపై ప్రసంగించారు.

ఒకసారి తీవ్రమైన కరవు ఏర్పడినప్పుడు హుజూర్ అలైహిస్సలాం లంగర్‌లో పిండి కలుపుతూనే ఉండాలని, రొట్టెలు సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. రొట్టె అడిగే ప్రతి ఒక్కరికీ రొట్టె ఇవ్వాలని, ఎవరూ ఖాళీ చేతులతో తిరిగి వెళ్లకూడదని చెప్పారు.

షేక్ హామిద్ అలీ గారిలా వివరిస్తున్నారు. హుజూర్ అలైహిస్సలాం తమ జీవితాంతం నా నుండి ఎప్పుడూ పైసా లెక్క అడగలేదు, అలాగే నాపై ఎన్నడూ కోపగించుకోలేదు.

హజ్రత్ షేక్ అహ్మద్ దీన్ గారిని ఒకసారి హుజూర్ (అ) ఏదో పనిపై పంపిస్తూ, మరుసటి రోజు త్వరగా వచ్చేయమని ఆదేశించారు. ఆయన ఇలా వివరిస్తున్నారు. నేను మరుసటి రోజు ఆలస్యంగా చేరుకున్నాను. అప్పటికే హుజూర్ (అ) నా గురించి ఆందోళన చెంది, వెతకడానికి ఒక మనిషిని పంపించారు. నేను హుజూర్ (అ) సముఖంలోకి వెళ్లగానే, ఆయన అందరికంటే ముందు మీకు ఏమీ ఇబ్బంది కలగలేదు కదా? అని అడిగారు. హుజూర్ (అ) అలా క్షేమసమాచారాలు అడగడంతో నా హృదయం ఎంతో ఆనందించింది. నేను ఖర్చుల లెక్క ఇవ్వబోగా, హుజూర్ (అ) మన మధ్య లెక్కలు ఏమిటి? ఈ డబ్బులను మీ అవసరాల కోసమే ఖర్చు చేసుకోండి అని ఆదేశించారు.

హజ్రత్ హకీమ్ మౌల్వీ నూరుద్దీన్ గారు ఒకసారి హుజూర్ (అ) నుండి కొంత అప్పు తీసుకున్నారు. ఆ అప్పు డబ్బును ఆయన తిరిగి పంపినప్పుడు, హుజూర్ (అ) దానిని ఇష్టపడలేదు. పైగా మీరు మా

డబ్బును మీ డబ్బు కంటే వేరుగా భావిస్తున్నారా? అని అన్నారు.

హజ్రత్ షేక్ యాఖూబ్ అలీ ఇర్ఫానీ (రజి) గారిలా వ్రాస్తున్నారు. హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం దైవ సందేశాన్ని (తన అవతరణ గురించి) ప్రకటించినప్పటి నుండి, అలాగే రాజులు నీ దుస్తుల ద్వారా శుభం వెతుకుతారు అని అల్లాహ్ తఆలా మీకు శుభవార్త అందించాడని ప్రజలకు తెలిసినప్పటి నుండి, ప్రజలు సాధారణంగా మీ దుస్తులను అడుగుతూ ఉండేవారు. మీరు ఎన్నడూ ఎవరికీ నిరాకరించలేదు. కొన్నిసార్లు పరిస్థితి ఎలా ఉండేదంటే, మీ శరీరంపై ఉన్న దుస్తులు తప్ప మిగిలినవన్నీ ఇతరులకు ఇవ్వబడేవి.

ఒకసారి హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారి ఇంట్లో ఒక పేద మహిళ కొన్ని బియ్యాన్ని దొంగిలించింది. ప్రజలు ఆమెను చూసి గొడవ చేయడం ప్రారంభించారు. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారు ఆ సమయంలో తన గదిలో పని చేసుకుంటున్నారు. ఆ శబ్దం విని ఆయన (అ) బయటకు రాగా, ఒక పేద, దీన స్థితిలో ఉన్న మహిళ చేతిలో కొద్దిపాటి బియ్యం మూట పట్టుకుని నిలబడి ఉన్న దృశ్యం కనిపించింది. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారికి జరిగిన విషయం తెలిసి, ఆ పేద మహిళ స్థితిని చూసినప్పుడు ఆయన (అ) హృదయం ద్రవించిపోయింది. ఆయన (అ) ఈమె ఆకలితో, నిరుపేదరాలిగా కనిపిస్తోంది. ఈమెకు కొన్ని బియ్యం ఇచ్చి పంపించేయండి, ఇంకా కొన్ని ఎక్కువగానే ఇవ్వండి, అల్లాహ్ తప్పులను దాచే గుణం అనే శైలిని అవలంబించండని హితవు పలికారు.

హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ గారు ఈ సంఘటనను వివరిస్తూ ఇలా వ్రాశారు. ఈ సంఘటనపై ఎవరైనా తొందరపాటు స్వభావం గల వ్యక్తి ఇది దొంగతనానికి ప్రోత్సాహం అందించడమే లేదా ఒక దొంగకు మీరు ధైర్యం ఇస్తున్నారు అని అనవచ్చు. కానీ వివేకవంతులు, బుద్ధిమంతులు గ్రహించేది ఏమిటనగా ఆ ఆస్తి స్వయంగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం గారిదే అయినప్పుడు, మరియు ఆ వస్తువు తీసుకున్న మహిళ ఆకలితో అలమటిస్తున్న నిరుపేద అయినప్పుడు, ఇది దొంగతనానికి సహాయం చేయడం కానే కాదు. వాస్తవానికి ఇది పేదలకు అన్నదానం చేయడం కిందికే వస్తుంది. దొంగతనం చేసినవాడు అత్యంత పేదవాడై, తీవ్రమైన ఆకలి బాధతో ఏదైనా తినే వస్తువును తీసుకుంటే, అతనిని దొంగగా పరిగణించకుండా, క్షమించి వదిలేయాలని స్వయంగా హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం గారి హదీసుల ద్వారా కూడా రుజువైంది. ఇవే తమ యజమాని (మహా ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం) ను పరిపూర్ణంగా అనుసరించడానికి ఉదాహరణలు.

اللّٰھم صل علی محمد و علی عبدك المسیح الموعود وبارك وسلم

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ۔ وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا۔ مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ۔ وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ۔ عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِى الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ۔ يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ۔ اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ۔